# నానీడ చూసుకునే నేను జంకేను

"నేను అదృష్టవంతురాలిని కాదు కనక నేను పుట్టిన మూడోనాడు చచ్చిపోయిందిట మాఅమ్మ. అప్పట్నుంచీ నన్ను మా సోమమ్మత్త పెంచింది. మా అమ్మ పోయేక సంవత్సరం తిరక్కుండా మానాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. మాపిన్ని కాపరానికి వచ్చేటప్పటికి నాకు మూడేళ్ళు వెళ్ళేయి. మానాన్నకి నామీద చాలా అభిమానం వుండీది., మా అత్త నన్ను ప్రాణంగా చూసుకునీది."

"నాకు తొమ్మిదేళ్ళు వచ్చేయి. కలరా వచ్చి మాఅత్త హఠాత్తుగా చచ్చిపోయింది. మాఅమ్మ అప్పుడు చచ్చిపోయిందనుకున్నాను. పోతూ పోతూ మాఅత్త మానాన్నతో "నరుసు జాగర్త. వొక కంటితో చూస్తూ వుండు దాన్ని" అంది. "అలాగే" అన్నాడు మానాన్న."

"నెల్లాళ్ళదాకా నాకు యేడుపు పోలేదు. తరవాత విచారం కొంత తగ్గింది. కాని అమ్మా, అమ్మ తరవాత అమ్మలాంటి అత్తా పోయేక ఆడపిల్లకి యింకేం వుందీ?"

"మా పిన్ని నన్ను సరిగ్గా చూడడం మానేసింది. మానాన్న కొన్నాళ్ళు నన్ను వెనకవేసుకు వచ్చాడు. అలా వకటి రెండు మాసాలు జరిగి పోయాయి. తరవాత మా నాన్నకి కూడా నేను బరువైపోయాను"

"మా పిన్నికి తొలిచూలు కూతురు పుట్టింది. మా చెల్లెలు సుబ్బమ్మ పుట్టేకే మా అత్త చచ్చిపోయింది. అంచేతే మా అత్త మానాన్నతో నన్ను గురించి అలా చెప్పింది."

"యేం చెబితే యేం లాభం? మానాన్న మరచిపోయాడు నన్ను. కొన్నాళ్ళు సొంతంగా నాకు దగ్గిర కూచుని వణ్ణం తినిపించిన మానాన్న నేను తిన్నానో లేదో కూడా కనుక్కోవడం మానేశాడు."

"మా పిన్నికి సర్వాధికారం వచ్చింది. నన్ను తిట్టడం మొదలు పెట్టింది. కొట్టడమూ, మొట్టడమూ మొదలయింది. యేం చెయ్యనూ? మా అత్తని తలుచుకుని యేడ్చీదాన్ని. గట్టిగా యేడిస్తే మళ్ళీ కొట్టీది. లోపల్లోపల కుమిలికుమిలి యేడ్చీదాన్ని. మొదట మానాన్నతో చెప్పేను వోమాటు. "నువ్వు దానిమాట వినకపోతే వూరుకుంటుందా" అన్నాడు మానాన్న. "కొడితే కొడుతుంది. యీమాత్రానికి నాతో చెప్పాలా?" అన్నాడు కూడానూ. ఇది మా పిన్ని వింది. ఫిర్యాదు చేస్తావా అని ఆవేళ చావకొట్టి చెవులు మూసింది."

"అసలు యిల్లు కదలడానికి వీలే వుండీది కాదూ నాకు. యెప్పుడేనా వెడితే కొట్టీది. ఎవరి పిల్లలేనా మా యింటో ఆడుకోడానికే నాకోసం వస్తే

వాళ్ళమీద కోప్పడీది. వకటి రెండుమాట్లు చూచి వాళ్ళు రావడం మానేశారు. రోజూ పొద్దున్న వకపావుగంటా, సాయంత్రం వక పావుగంటా నాకు ప్రపంచకం కనిపించీది. అంతే."

"అంతే. అబద్ధం కాదు. చెరువుకి వెళ్ళేటప్పుడెంతో అంతే. తరవాత నూతులో కప్పలాగ యింటోనే మునిగితేలుతూ వుండీదాన్ని. సర్వాధికారమూ తనకు వచ్చేక మాపిన్ని దాసీదాన్ని మానిపించేసింది. అది చేసీ పనులన్నీ నావి. వీధి తుడిచి నీళ్ళు చల్లడం; అంట్లూ చెంబులూ తోమడం- వకటేమిటి దాసీది చేసీ పనులన్నీ నావి."

"కాకులు కూస్తూ వుండగా లేచింది మొదలు వూరుమాటు మడిగేక పడుకునీ దాకా అవేం పనులో యిసకపాతరలాగ వూరిపోయీవి. సుబ్బమ్మని యెత్తుకుంటే "యెత్తు మప్పుతావా" అనీ, లేకపోతే "యేడుస్తుందనేనా యెత్తుకోక మొద్దులాగ వూరుకుంటావా" అనీ, అది యెందుకేడ్చినా నేనే యేడ్పించాననీ, యిలాగ యేమిటేమిటో చూస్తూ వుండగా నేరాలు కల్పించి మాపిన్ని తిట్టీది. నూటికి తొంభై మాట్లు కొట్టీది కూడానూ. యేం చేసినా పడి లోపల్లోపల కుళ్ళీదాన్ని నేను."

"యేం చెయ్యనూ? వక్కక్కప్పుడు వేళకి వణ్ణం పెట్టీది కాదు. వక్కప్పుడు వరసగా నెలేసిరోజులు చద్దివణ్ణం వుంచీది కాదు. చిక్కిపోయాను. నల్లబడ్డాను. ప్రాణాలు మాత్రం వున్నాయి."

"అంతే. ప్రాణాలు నిలిచివున్నాయి. పదిరోజుల కోమాటు తలదువ్వీది మాపిన్ని. నెలకోమాటు తలంటీది. రెండు పరికిణీలే వుండేవి నాకు. వొకమాటు చూడలేక మా యిరుగు పొరుగున వున్న యిల్లాలొకావిడ తన కూతురుతోపాటు నాక్కూడా తలంటింది. యెరక్కపోయీ బుద్ధిగడ్డితిని అంటించుకున్నాను. ప్రళయం వచ్చినట్లయిపోయింది. "అత్తేరీ వీధులో వాళ్ళచేత అంటించుకుని నాకు అపకీర్తి తెస్తావా" అని మాపిన్ని ఆవేళ నాకు వణ్ణం పెట్టింది కాదు."

"కాలం యిలా గడిచిపోయీది. నాకు పదకొండేళ్ళు దాటేయి. మానాన్నకి నాధ్యానమే లేదు. మాపిన్నే పెళ్ళి చెయ్యమంది. పిల్లనిస్తామని మానాన్న వెడితే వారు వెయ్యిరూపాయలు కట్నం యిమ్మన్నారు. మాపిన్ని యేమిటో ఆలోచన చెప్పింది. రెండు యెకరాల భూమి యిస్తానని చెప్పి సంబంధం నిశ్చయం చేసి మానాన్న నాకు పెళ్ళి చేశాడు."

"మా అత్తారి వూరు మండపేట. యింటిపేరు దివాకర్లవారు. వడ్డీవ్యాపారం చేస్తారు. వారిపేరు - వారిపేరు - చెబితే యేం? ప్రకాశరావుగారూ వారి పేరు."

"నా పెళ్ళి అయిన రెండేళ్ళకి మా సుబ్బమ్మ పెళ్ళయింది. వెయ్యిన్నూట పదహార్లు కట్నం యిచ్చాడు మానాన్న. ఫెళ్ళుమంటూ పెళ్ళిచేశాడు. నాపెళ్ళి యేదో కానిచ్చేశాడు. అయితే నాకా విచారం లేదు. తల్లి లేని పిల్లకి - సవిత్తల్లి చేతుల్లో వున్న పిల్లకి అచ్చట్లూ ముచ్చట్లూ యెలా తీరతాయీ?"

"నా పెళ్ళయేక మానాన్న వారిని వక్క మాటే పండుక్కి తీసుగువచ్చి నాలుగు రూపాయల జామారు పెట్టేడు. సుబ్బమ్మ మొగుణ్ణి వారు వెళ్ళిన రెండుదినాలదాకా అట్టేపెట్టి పట్టుతాపితాలు యిచ్చి పంపేడు. నాకు మహాదు:ఖం వచ్చింది; గాని యేం చెయ్యనూ?"

"లోపల్లోపల కుళ్ళడం తప్ప చెయ్యడానికి యేం వుందీ? తరవాత రెండేళ్ళకి నేను కాపరానికి వెళ్ళేను. వారు నన్ను చాలా ప్రేమతో చూశారు. నాస్థితి అంతా వారికి తెలుసును. సారియేమీ పట్టుకు రాలేదని మా అత్తగారు యేదో అనగా వారు ఆవిణ్ణి యేమో యేమో చెప్పి సమాధానపరిచేరు. మళ్ళీ యెప్పుడూ ఆవిడ - ఆవిడే గాదు యెవరూ ఆమాట యెత్తలేదు. నన్ను అందరూ అనుగ్రహంతోనే చూసీవారు."

"వకనాడు రాత్రి కట్నం యిచ్చిన భూమితాలూకు శిస్తు నీకేమేనా యిచ్చాడా మీ నాన్న?" అని వారు అడిగేరు. యేమీ యివ్వలేదన్నాను. ఆ సంగతే మరిచిపోయానన్నాను. నా అమాయకత్వానికి వారు చాలా విచారించేరు."

"అప్పటికిని నేను కాపరానికి వెళ్ళి ఆరునెల్లయింది. ఈ లోపుగా వక్కమాటయినా మానాన్న నన్ను చూడడానికేనా రాలేదు. అత్తవారింటో వుండే సుఖం చేత నాకు పుట్టిల్లు జ్ఞాపకమే రాలేదు."

"వొక నెల గడచిపోయాక వారు "మరి కట్నం భూమి మాట యేమిట"న్నారు. నాకేం తెలుసునన్నాను. ఆలోచించు అన్నారు. "శిస్తు లెక్క చూసుకుంటే సంవత్సరానికి వందరూపాయలు. భూమి ఖరీదు చూసుకుంటే యకరం అయిదువందలికి తక్కువలేదు. ఇంత సొమ్ము వదులుకోవడమేనా? వారు బుద్ధిపూర్వకంగా యిస్తానన్నదే గదా?" అని అడిగేరు. మీరేం చేసినా సరే అన్నాను. అయితే వకమాటు వెళ్ళి మీనాన్న నడిగిరా అని మా మరిదినిచ్చి రాయారం పంపించారు."

"ఈమాట చెప్పేటప్పటికి మానాన్న మళ్ళీ మాట్లాళ్ళేదు. మాపిన్ని మండిపోయింది. మా సంసారం గుల్ల చేస్తావా అంది. నేను తెల్లపోయాను. "నాలుగు రోజులు వుండి మెల్లగా కదుపు" అని చెప్పి మామరిది వెళ్ళిపోయాడు."

"యేమిటి సంగతి అని వచ్చి ప్రాధేయపడక పిల్లని పంపించేస్తాడా? నాకూతుర్ని యేలడూ వీడూ? పోనీ నాయింటోనే వుంటుంది నాకూతురు. అదో కొడుకనుకుంటాను" అని మానాన్న మండిపడ్డాడు. "అది కాదు నాన్నా" అని నేను చెప్పేను; గాని మా నాన్న వినిపించుకోలేదు. ఈ గందరగోళం యిలా జరుగుతూ వుండగా మళ్ళీ మామరిది వచ్చేడు. సంగతంతా చెప్పగా అతను తెల్లపోయాడు. "రా వెళ్ళిపోదాము" అంటే మానాన్నతో చెప్పమన్నాను. "మావదిన్ని తీసుగువెడతాను" అంటే "అప్పుడు తీసుకువచ్చి దిగబెట్టడానికీ యిప్పుడు తీసుకువెళ్ళడానికీ నీయిష్టమే? కట్నం భూమిమాట యేమిటని నింపాదిగా అడుగుతాడా నాకూతుర్ని పంపేస్తాడా? నాకూతుర్ని యేలడూ నీయన్నా?

చూద్దాం. మళ్ళీ నాగుమ్మంలో అడుగు పెట్టేవంటే బాగా జరగద"ని మానాన్న రూజుకున్నాడు. చిన్నపిల్లాడూ పాపం మామరిది. ఈ గందరగోళం విని తెల్లపోయాడతను. నేను "మీ అన్నయ్యని పంపిచవోయి" అన్నాను."

"అతను వెళ్ళి యేం చెప్పేడో యేమిటో వారూ రాలేదు. అతనూ రాలేదు మళ్ళీని. కబురే లేదు. యింకా రాయారంలోనే చిక్కడిపోయాను నేను. పంపమని మానాన్నతో చెప్పలేను. కాపరం వదలుకుని వుండడం కష్టంగా వుంది. యేం చెయ్యనూ? నాలో నేను యేమీ తోచక ఉక్కిరిబిక్కిరై పోయాను."

"రోజులల్లా నెల్లయేయి. నెల్లల్లా సంవత్సరాలయేయి. వకటల్లా రెండేళ్ళయింది. మూడో యేడు వచ్చింది. వోమాటు కదిపేను మానాన్నతో. మండిపడ్డాడు నామీద. "ఆవెధవ యింటికి నిన్ను పంపుతానా యింకా? వాడిగడ్డి వాణ్ణి తినిపిస్తాను. కోర్టు కెక్కించి ముప్పుతిప్పలూ పెడతాను" అన్నాడు. "యేమిటి గతి దేవుడా" అని విచారించడం మొదలుపెట్టేను."

"అక్కణ్ణుంచి కబురులేదూ. యిక్కడ యిలా వుంది. మాపిన్ని ఆర్భాటం పట్టలేకుండా వుంది. బతుకంతా చీకటిమయం అయిపోయింది."

"ఇకలాభం లేదని నిరాశ చేసుకున్నాను. యాతన నిరాఘాటంగా ప్రబలిపోయింది. అక్కడ యేమి ఆలోచనలు జరుగుతున్నాయో యేమీ తెలవలేదు. మళ్ళీ వూరుకోవడానికి కారణం తెలిస్తే బాగుండిపోవును. అంతా అయోమయంగా వుంది."

"యేళ్ళు నిండిన పిల్ల కాపరం చెరుపుకుని యిల్లు చేరితే భరించడం యెలాగా? యెన్నాళ్ళని పెట్టగలం?" అని మాపిన్ని మొదలుపెట్టింది. నాకు ప్రాణాలు లేవు. "యీగోల యేమిటి దేవుడా?" అని బెంగపెట్టుకున్నాను. "నన్ను పంపించెయ్యి నాన్నా కట్నం వద్దు యేమీ వద్దు" అనగా మానాన్న నింపాదిగానే మాట్లాడేడు. "వాడు నిన్నేలతాడా? ఈ వంకపెట్టి పంపేశాడు నిన్ను చండాలుడు" అన్నాడు. "అవునా?" అని అనుమానం పుట్టింది నాకు."

"వకప్పు డవునేమో అనుకున్నాను. వకప్పుడు "అలాంటి వుద్దేశమే వుంటే అక్కడ వున్నప్పుడు నన్నంతగా ప్రేమించేరు యేమీ?" అనుకునేదాన్ని. యేమయినా వకటే. కాపురం చెడిపోయింది."

"మళ్ళీ పెళ్ళాడతాట్ట" అన్నాడు మానాన్న. "అయ్యో" అని కూలబడ్డాను నేను. దావా చేస్తానన్నాడు మానాన్న. వద్దని బతిమాలేను. యెన్నాళ్ళని పెట్టగలం? అంది మాపిన్ని. "దేవుడా, రక్షించు" అని మొక్కుకున్నాను. భారం అంతా దేవుడు మీద వేశాను."

"యెప్పుడు చేశాడో దావా మానాన్న నాకు తెలవదు. పని వుందని వొకనాడు నన్ను రామచంద్రపురం తీసుగువెళ్ళేడు మానాన్న. వక ప్లీడరుగారి యింటికి తీసుకు వెళ్ళేడు. ఆయన కోర్టులో యేం చెబుతావ"న్నాడు. "ఏమిటి

మహారాజా" అన్నాను. మానాన్న నా కొంపతీశాడని అప్పుడు తెలిసింది. మొత్తుకున్నాను. మానాన్న "ప్లీడరుగారు చెప్పినట్లు కోర్టులో చెప్పకపోతే చంపేస్తాన"న్నాడు. ప్లీడరుగారు కూడా అలాగే చెప్పేరు. "నేను చెప్పినట్లు చెప్పకపోతే మనోవృత్తి రాద"న్నారు. "మహారాజా, నాకు అక్కర్లేద"న్నాను. "మానాన్న నాకు చెప్పకుండా నాగొంతుక్కోశాడ"న్నాను. మానాన్న నన్ను కొట్టేడు. "యేమైనా సరే నాకు మనువర్తి అక్కర్లేదన్నాను. నేను కోర్టుకి రానన్నాను."

"మానాన్నని శాంతింపజేసి ప్లీడరుగారు నాదగ్గిరకి వచ్చి మెల్లిగా బోధించడం మొదలు పెట్టేరు. కోర్టుకు వస్తే నీకు లాభం వుందన్నారు. అమాటమీద నాకో ఆలోచన తోచింది. వస్తానన్నాను. ఆయన దారిలో పడ్డాననుకున్నాడు."

"వంటి గంటకి కోర్టుకు వెళ్ళేను. దేవుడుకోసం వెదికేను. గంట అయినాకా నడివీధిలో పదిమంది మధ్య నుంచుని వున్నారు వారు. మానాన్న కోర్టులో వున్నాడు. క్షణం వుండలేకపోయాను. ఎక్కడలేని సాహసమూ వచ్చింది. సిగ్గు లేకుండా పోయింది. తటాలున పదిమంది మధ్యకీ వెళ్ళి కాళ్ళ మీద పడి "నన్ను రక్షించండి" అని ప్రార్థించేను."

"మీరు మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నారుట. అయినా నాకు సంతోషమే. మీకు యెలా సుఖమూ, ఆనందమూ కలిగితే అలా చెయ్యండి. మీకూ, చెల్లెలికీ నేను పాదసేవ చేసుకుంటూ తరిస్తాను. అలా అనుగ్రహించండి" అన్నాను."

"అంతా తెల్లపోయారు. వారు మాటే ఆడలేకపోయారు. "ఏమంటావు?" అని యెవరో అడిగారు. "యేం తప్పు చేశానని నన్ను విడిచి పెళ్ళాడతారూ? అక్కడా యిక్కడా యేం జరిగిందో నాకేమీ తెలవదు. మా పింతల్లి పెట్టిన యమయాతన అనుభవించడంలోనే నాకు పగళ్ళు పోయి రాత్రిళ్ళు వచ్చేవి. నాపేరిట మనువర్తికి కోర్టులో దావా పడిందన్న సంగతి నాకు తెలిసి రెండుగంటలయింది. నెత్తినోరూ బాదుకుంటే మానాన్న నన్ను కొట్టేడు; ప్లీడరుగారు మీమీద నేరాలు చెప్పమన్నారు కోర్టులో. ఈరూపకంగా నయినా మీపాదాలు దొరుకుతాయని నిశ్చయించుకుని యిక్కడికి వచ్చాను. లేకపోతే ప్లీడరు గారి దొడ్లో నూతులో పడివుందును. నేను మీకేం అపరాధం చేశానని నన్ను వదలిపెట్టేరూ? మానాన్న కట్నం యివ్వకపోతే నన్ను బాధించడం యేంధర్మమూ? ఎప్పటికేనా మీకు అనుగ్రహం రాకపోతుందా అని బతికివున్నాను. నన్ను ఏలుకోకపోతే మీయింటో దాసీగా వుంటాను. అలాగయినా అనుగ్రహించండి" అని ప్రార్థించేను."

"అంతా తెల్లపోయారు. నాపాలిటి దేవుడు నన్ను లేవదీశారు. సంభాషణలలో వారు యిప్పటికీ నామీదే మనస్సు వుంచుకున్నారనీ, పెళ్ళాడాలని కలలోనైనా తలచివుండలేదనీ తెలిసింది. నేనే యీదావా చేశానని వారు ఆశ్చర్యంగా

వున్నారని తెలిసింది. అంతా నన్ను ఆశీర్వదించి వారికి అప్పగించారు. వారు నాకు ప్రాణం పోశారు."

"అక్కడ నున్నవారంతా నన్ను మునసబుగారి దగ్గిరకి తీసుగువెళ్ళి యీ సంగతి అంతా చెప్పేరు. కోర్టు అంతా తెల్లపోయింది. నా ప్రార్థన విని అధికారి నా దావా తీసేశారు. మానాన్న మీద కేసు తెస్తామంటే "తుదకి నాకాపరం బాగుపడింది కనక యెవర్నీ యేమీ చెయ్యవద్దని బతిమాలగా వారు చీవాట్లు పెట్టి మానాన్నని పొమ్మన్నారు."

"వారు నన్నిపుడు నెత్తిమీద పెట్టుకుని ఆదరిస్తూన్నారు. అంతమంచివారు ఎక్కడా వుండరు. ఈసంగతి నాకు మొదటినుంచీ తెలుసును; గాని మానాన్న మాటలు విని మధ్యమధ్య నానీడ చూసుకునే నేను జంకేను."

"పూర్వజన్మంలో యేదంపతులినో బాధ పెట్టేను. ఆపాపం యిప్పుడు యిలా అనుభవించాను. యేది యెలా అయినా వారికి నామీద పరిపూర్ణానుగ్రహం కలిగింది. నాకంతే చాలు."

❀ ❀ ❀